# దేవాలయం

దేవాలయంలో పురాణం విని అప్పుడే యింట్లో అడుగెట్టిన సీతమ్మ రౌద్రాకారంతో పచార్లు చేస్తున్న భర్తను చూచి నిశ్చేష్టురాలై పోయింది. కారణమేమో అడిగే ధైర్యం కూడ లేక వంటింట్లో ఉన్న కూతురు దగ్గర కెళ్ళింది.

"ఏదో ఉత్తరం వచ్చింది. అన్నయ్య రాశాడేమో మరి! అది చూచుకొని అలా గంతులేస్తున్నారు నాన్న" అంది పద్మ మెల్లగా.

"తండ్రీ-కొడుకు" ఒకాళ్ళని మించినవాళ్లొకళ్ళు. మధ్య నా ప్రాణాలు తీసేస్తున్నారు. ఇదేం సంసారమోరా నా తండ్రీ" అని లోలోన సణుగుకుంటూ ఒక పీట వాల్చుకు కూర్చుంది సీతమ్మ.

వంటింట్లో గుసగుసలు విన్పించాయేమో గబగబ సుడిగాలిలా వచ్చినట్లు వంటింటివైపుకు గంగాధరంగారు. ఆయన కోపతాపాలను బాగా అలవడియున్న ఆ తల్లికూతుళ్ళు మౌనమే శరణంగా భావించారు. కాని ప్రస్తుతం ఆయనముందా తారక మంత్రం పనిజేయలేదు.

"అట్లా నిలువు గుడ్లేసుకు చూస్తావేమే — ఈ యింటి భాగ్యలక్ష్మి నీవు పట్టినట్లుగా దేవాలయాలు, శరణాలయాలు ఉంటే చాలు నీకు. ఇంకేం అక్కర్లేదు."

"రామరామ దేవాలయం, శరణాలయమూనా, పాపం పుణ్యాలు" అంటూ లెంపలేసుకు దణ్ణం పెట్టింది. ఎవరేం తప్పు మాట్లాడినా ఆవిడకి లెంపలేసుకు దణ్ణం పెట్టడం అల వాటు.

ఆ మాయింటమ్మకు నేడేదో మరికొంత గట్టిగా మాయిం చుకో ఇది మాంచుకుని — పుత్రుడి ఘనకార్యం" అంటూ ఆమె ముఖం మీదికి విసిరికొట్టి విసవిసా వెళ్ళిపోయాడు చావడి లోకి. ఎక్కడెవరిమీద కోపం వచ్చినా అది సాధువైన భార్య సీతమ్మపై చూపెట్టడం ఆయన కలవాటైపోయింది పెళ్ళయి నప్పట్నుంచి.

వచ్చిరాని కన్నీళ్ళను తుడుచుకుంటూ ఆ కవరు తీసుకొని కిచ్చింది. చదువుతూ గబగబ పేజీలు చదివేసుకు గంతులేయ్యాలని ఆనందం కలిగింది. అదేమిటో అర్థంకాలేదు సీతమ్మగారికి.

"ఉత్తరం చదవమంటే ఈ గంతులేమిటే పదహారేళ్ళొచ్చినా ఇంకా చంటిపిల్లలాగా" విసుక్కుంది.

"అది కాదమ్మా. మరేం...... అన్నయ్య.....! అన్నయ్య......"

"ఛీ. వెధవగోల. మనుష్యుల్ని బెదరగొడతావా పదవ మాటలాంటేం?"

ఆ కోపం చూశాక పద్మ సంతోషం కాస్త తగ్గింది. చదవడం మొదలెట్టింది.

"అమ్మగారికి నాన్నగారికి నమస్కారములు :

ఉత్తరాలు వ్రాయడంలేదని పదేపదే కోపంగా వ్రాస్తున్నారు. ఏం వ్రాయను——మీలాంటి మనుష్యులకు?

నేనే కాదు—— మీరూ చదువుకొన్నారు. విద్యావంతులైనందుకు—— ప్రవర్తన, ఆలోచనకూడా ఆ స్థాయిలోనే ఉండాలి. పాత పద్ధతులు పట్టుకు వ్రేలాడితే లాభం లేదు. కాలంతోబాటు నాగరికత, మనుష్యులు, మనస్సులు కూడ మారాలి.

మీ బిడ్డనైనందుకు మిమ్మల్ని గౌరవించాలి. గౌరవిస్తున్నాను. కాని నాకుకూడ వయస్సు "మంచి—చెడు" అనే విమర్శనా జ్ఞానం ఆలోచనాశక్తి వచ్చినతర్వాతకూడ ఇదివరకులాగే అన్ని విషయాలలోనూ మీ పెద్దరికాలే చెల్లించుకోవాలని పట్టుబట్టడం కేవలం అవివేకం. క్రిందటిసారి సెలవులో వచ్చినప్పుడు అనేకవిషయాలగురించి మీతో మాట్లాడుదామని అనేకసార్లు ప్రయత్నించాను. కాని మీరు నిశ్చయించిన సంబంధం చేసుకోననగానే ఇహ నను పెదవి కదపనీయకుండా నానా మాటలు అన్నారు. మనిషి—— మనిషి అయినప్పుడు భేదాభిప్రాయాలు రావడం సహజం. ఆ సమస్యలను మనస్సువిప్పి మాట్లాడుకొని, కారణాలు నిర్ణయించి సౌమ్యంగా పరిష్కరించుకోవాలే కాని ఆవేశాలు ప్రదర్శించడంలో ప్రయోజనం?——ఇప్పుడు తెలుస్తుంది బాగా.

మీ రనుకొంటున్న అమ్మాయిని చూచుకోవడానికి నేను రావడం లేదు. పదిహేను రోజుల క్రితం నేను వివాహం చేసుకొన్నాను. రేపు సాయంకాలం ట్రెయిన్‌లో — అంటే మీకు ఈ లెటరు చేరిననాటి సాయంత్రమే — వస్తున్నాం. మీ చేతులమీదుగా జరగవలసిన వివాహం — మీ మొండి పట్టువల్లనే మరోవిధంగా జరిగిపోయింది — క్షమించమనాలో; లేదో నాకు తెలియదు. మీ కిష్టమున్నా లేకపోయినా, మీ కోడల్ని మీకు ఒకసారి చూపించవలసిన బాధ్యత నాపైన ఉందనుకుంటాను. మీ కిష్టముంటే వుంటాం, లేకుంటే వెళ్ళి పోతాం. అందువల్ల మేము వచ్చినప్పుడేమీ అల్లరి, హంగామా చేయవద్దని మరీమరీ వ్రాస్తున్నాను. నేనెక్కడున్నా నా ఆస్తి, నా కాళ్ళదగ్గరకు వచ్చి వాల్తుంది. ఎటొచ్చీ — అనవసరంగా తొందరపడితే మనుష్యులం మాత్రం దూరమై పోతాం. వివరాలన్నీ — మీకు వినే ఓపిక వుంటే వచ్చాక చెప్తాను.

పరీక్షలు బాగానే వ్రాశాను. వచ్చే వారంలో రిజల్ట్సు తెలుస్తాయి. ఫస్టు క్లాసు వస్తుందనుకుంటాను.

మీ కుమారుడు

రఘునాథ [illegible]దరి.”

“అయ్యో అయ్యో, ఎంతపని చేశావురా నాయనా” అంటూ శోకాలు మొదలెట్టింది సీతమ్మగారు.

"నాన్సెన్స్. సిగ్గులేక—ఎందుకా శోకాలు. ఇరుగు-పొరుగు నవ్వడానికా?" గంగాధరం గర్జించాడు.

సీతమ్మ నోటికి ప్రమాతపడింది. నిశ్శబ్దంగా ఏడుపు సాగించింది.

"ఇక్కడికి చదువుచాలు. ఎక్కడైనా వుద్యోగమేదువు అంటే విన్నాడా? నీ మటుకు నువ్వు గోల వాడిమట్టుకు వాడు గోల! నా మాటకాదని విశ్వప్రయత్నంచేసి వాడికి మద్దత్తు నిచ్చినందుకు అనుభవించు. అదెవరో తెలియదు. దాన్ని మననెత్తి కెక్కించుతాడిప్పుడు."

"ఏదో ఎమ్. ఎ. ప్యాసయితే మంచి వుద్యోగము చేస్తాడనుకున్నాను కాని—ఇలా కొంప ముంచుతాడనుకున్నానా?" ముక్కు చీదుతూ దీర్ఘం తీసింది భార్య.

"నిక్షేపంలా ముప్పై వేల కట్నంతో నేను సంబంధం మాట్లాడితే ఇదేం దుర్బుద్ధి; ఈ వెధవకి? నేనిప్పుడు వాళ్ళకేం చెప్పాలి?......ఆ వెధవ ఉపన్యాసాలూ, వ్రాతలు చూచి అనుకుంటూనేవున్నా ఎప్పుడో ఇటువంటి అవాంతరం తెస్తాడని. కట్నం పుచ్చుకోవడం నాగరిక లక్షణంకాదట. కుల భేదాలు పాటించడం విద్యావంతులకు తగదట వెధవ పొయ్యే కాలం బుద్ధులు - వాడికంటే పనికిమాలిన వెధవలందరూ పోగై ఇంత తెలివైనవాడు లేడని పొగడ్తాంటే—వ్వూ... సంబరపడిపోయావు—జ్ఞాపకముందా? అప్పుడు కాదు, ఇప్పుడు సంతోషించు. కొడుకు ప్రయోజకత్వం చూచి" పళ్ళు పటపట కొరికేస్తున్నాడు గంగాధరం.

సీతమ్మకు అరికాలినుంచి నెత్తికెక్కింది. "ఏమిటండీ పాడుగోల! కొడుకింత బుద్ధిలేకుండా పోతాడేమో అని నేనేడుస్తోంటే ఈ సాధింపేమిటసలు? మీరు పెళ్ళయిన క్రొత్తలో మీరేం చేశారు? తాతలనాటినుంచి కలిసివున్న ఉమ్మడి కుటుంబంలో కలిసి వుండకని ఆ విడుచుకుని వేరేరాలా? మీ కొడుకు మీ కంటే నాలుగాకులెక్కువ చదివాడు. విచారం దేనికి?" అంటూ అక్కడనుంచి లేచి లోపలి కెళ్ళిపోయింది. పెళ్ళయిన నాటినుండి ఇంతవరకూ ఆవిడకంత కోపం రావటం గంగాధరంగారెప్పుడూ చూడలేదు. ఇప్పుడావిడ ఎదురుకోవడంతో ఆయన దూకుడు కాస్త తగ్గింది. గడియారం టంగ్ టంగ్‌న మూడు కొట్టింది. ఉలిక్కిపడ్డారు గంగాధరంగారు ఇంకో గంట కొడుకు వివాహానికున్నది! గబగబా భార్య కోసం లోపలికి పరుగెత్తాడు.

ఆవిడ పూజ గదిలో దేవుని పటాలముందు మోకరిల్లి వేడుకొంటోంది— "జరిగిందేదో జరిగిపోయింది. ఆ పిల్ల మాకులం లోనిదే అయితే ఏ గొడవా వుండదు. ఈ ఒక కోరికా తీరిస్తే వచ్చే ఏకాదశినాడు గుళ్ళోకుంకుమ పూజ చేయిస్తాను, అభిషేకము చేయిస్తాను. అనుగ్రహించు తండ్రీ."

అప్రయత్నంగా గంగాధరంగారూ నమస్కరించాడు. ఏం కోరుకొన్నాడో మరి!

"అప్పుడే మూడైంది ఇంకో గంట వ్యవధి ఏమిటి ఉపాయం?" అంటూ నీరసంగా భార్యప్రక్కన చతికిలబడ్డాడు.

ఆవిడ ఆశ్చర్యంగా చూచింది భర్తవైపు అంత విచారం లోనూ! ఈ పాతికేళ్ళ వివాహజీవితంలోనూ గంగాధరం ఆవిడను కేవలం భార్యగానే చూచాడు కాని, స్వంత ఆలోచన, అభిప్రాయాలుకల మనిషినిచూచినట్లు చూడలేదు. ఏవిషయం లోను, ఎట్టిపరిస్థితులలోనూ, ఆవిడ సలహాతోగాని, వృద్దేశ్యంతోకాని అవసరంలేకపోయింది. ఎప్పుడైనా ధైర్యంచేసి ఆవిడేమైనా చెప్పినా దాన్ని అతితేలికగా కొట్టిపారేసేవాడు. అటువంటి వ్యక్తి ఈనాడు తనంత తాను భార్య సలహా కోరుతున్నాడంటే అతని మనస్సు ఎంతగా పాడై పోయిందో గ్రహించుకోవచ్చు.

"నాకేం తోచడంలేదు. ఏం చేస్తామో త్వరగా——"

"ఏం జేస్తాం? వివరాలేమీ వాడు వ్రాయలేదాయె. అసలు రానీండి చూద్దాం. అసలింతకీ అదెవతో...కులమైతే నోరుమూసుకూరుకుందాం నలుగుర్లో నవ్వుల పాలుగాకుండా వాడప్పుడే ఆ స్థివరకు వెళ్ళిపోయాడు. కులంకాదంటే. మనకసలు కొడుకేపుట్టలేదనుకుందాం." ఆమాటలెంతనిర్మలంగా చెప్పినా, ఆ వెనుక ఎంత దావాగ్ని వుందో తెలుసుకోవడం కష్టంకాదు. గంగాధరానికా సలహానచ్చింది——కాని ఆశ్చర్యపోయాడు. రఘును ఆవిడ ఎంతగారాబంగా పెంచిందో ఆమెకంటే ఆయనకే బాగా తెలుసు. గంగాధరం ఎప్పుడైనా అతడివేపు కళ్ళెర్రజేసి చూచినా ఆవిడ ప్రాణం గిలగిలలాడిపోయేది. ఈగ వాలకుండా పెంచింది. 'మనాకసలు కొడుకే పుట్టలేదనుకుందాం' అని అన్నదంటే ఆవిడ ఎంత విరక్తి చెందిందో, ఎంత

కాకపట్టాందో వారికే తెలియాలి, అనుభవజ్ఞులకే తెలియాలి.

గంగాధరంగారిది ఆ వూళ్ళో అన్నివిధాలా పేరెన్నికగన్న కుటుంబం. యాభై ఎకరాల సుక్షేత్రమైన మాగాణి ఉంది. గౌరవ మర్యాదలకు పెట్టింది పేరు. ఒక కొడుకు, కూతురు ఉన్నారు. ఘోషాకు భంగం కలుగుతుందోనని కూతురు పద్మను చదివించనే లేదు. కొడుకు రఘు మాత్రం వూళ్ళో వున్న హైస్కూలు చదువు పూర్తిచేసి, దగ్గరలోనే వున్న పట్టణంలో కళాశాల చదువుకూడా పూర్తిచేశాడు. ఆ రోజుల్లోనే మంచి అభ్యుదయ భావాలుగల యువకుడుగా పేరొందాడు. ఆ చుట్టుపక్కల లేదంటే, అతను ఎరగని సభాప్రదేశం లేదు, అతడి నెరుగని వ్యక్తి వుండడంటే అతిశయోక్తి కాదు. ఇవన్నీ ఇష్టం లేకపోయినా గంగాధరం చూచీ చూడనట్లు వూరుకునేవాడు. బి. ఎ. పాసైన తర్వాత పై చదువు విషయంలో మాత్రం తండ్రికొడుకులు తీవ్రంగా వాదించుకున్నారు.

ఉమ్మడి కుటుంబంలోనుంచి విడిపోయినప్పుడు గంగాధరంగారికి ఒక పాతిక ఎకరాలు మాత్రమే వచ్చింది. తర్వాత క్రమంగా తన బుద్ధి చాతుర్యంతో ఆయన దానిని యాభై ఎకరాలు చేసి, ఒక మేడకూడా కట్టారు. దీనికితోడు కొడుకు సంపాదనకూడా వుంటే అన్నీ ఇంకా వృద్ధి చెయ్యవచ్చుననే తలంపుతో ఆయన రఘును ఉద్యోగప్రయత్నం చెయ్యమన్నారు. రఘు అభ్యంతరం చెప్పాడు. జరుగుబాటు వున్న వాళ్ళుకూడ ఉద్యోగాల కెగబడకూడదు. దగ్గరగా ప్రతీకం

మకు సరిపడిన ఆస్తివుంది. కనుక ఉద్యోగం చెయ్యవలసిన అవసరం లేదు. ఆస్తిపాస్తులు చూచుకునేందుకు, అజమాయిషీ చెయ్యడానికి తండ్రిగారున్నారు. అంచేత, తీరుబడిగా కూర్చునేకంటే ఇంకా చదువుతా నన్నాడు. ఆ మాట విని గంగాధరంగారు నిర్ఘాంతపోయారు.

ఇతరత్రా చాలవిషయాలలో ఆయన రఘు ఆదర్శాలు అభిప్రాయాలు విని వున్నారు. కాని ఈ భావమెప్పుడూ విని వుండలేదు. ఆయనకు కోపమొచ్చింది. ఏమైనా పై చదువు వీల్లేదన్నారు. కాని రఘు పట్టుదలకంటే సీతమ్మ పోరు ఎక్కువైంది. రఘు తెలివితేటలు తెలిసివున్న పెద్దా, చిన్నా అందరూ అదేపనిగా సలహాలివ్వడం, ఊదరగొట్టడం మొదలెట్టేసరికి, అయిష్టంగానే ఒప్పుకోక తప్పలేదు. ఫలితంగా రఘు కాశీ వెళ్ళాడు యమ్. ఎ. చదవడానికి.

కొడుకు అంటే ఉద్ధరించేవాడు, కూతురు అంటే నష్టాలు కలుగజేసేది అని గంగాధరం ఉద్దేశ్యం. పద్మ పెళ్లి విషయం తలచుకొన్నప్పుడల్లా ఆయనకు గుండె ఆగినంత పనవుతుంది. దమ్మిడీ కట్నం తీసుకోకుండా ఎక్కువ ఆస్తి కల అల్లుడు రావాలి — మిగతా విషయాలన్నీ ఎలావున్నా సరే! కాని కొడుకు విషయంలో మాత్రం అలా కాదు. రఘు పుట్టిన క్షణంనుంచీ కూడ అతని పెళ్ళి ఎప్పుడా అని ఎదురు చూస్తున్నాడు. ఎప్పుడైనా ఆస్తి విలువ అంచనా వేసుకునేటప్పుడు, కొడుకు రఘునుకూడ ఆ ఆస్తిలో చేర్చేవాడు — కట్నం

బజారులో రాబోయే విలువను చూచి దృష్టి పెట్టుకొని. అటు వంటి గంగాధరం ఇన్నాళ్ళుగా ఓర్పు వహించాడు కాని ఇహ ఉండలేకపోయాడు. ఈ సంవత్సరం యం. ఎ. పాసవుతాడని చెప్పి ముప్ఫైవేల కట్నంతో ఒక సంబంధం నిర్ణయించాడు. సంక్రాంతి సెలవులలో వచ్చినప్పుడు రఘును లాంఛనప్రాయంగా వెళ్ళి చూచిరమ్మన్నారు. "ఈ సంబంధం నాకిష్టంలేదు" అని రఘు అంటూండగానే ఇహ ఏమీ మాట్లాడనియకుండా ఆయన తారాపథానికి లేచిపోయేసరికి రఘు వెంటనే కోపంగా చదువుకొనే పట్నానికి వెళ్ళిపోయాడు. "పరీక్షలయ్యాక వస్తాడు. నచ్చచెప్పితే వాడే ఒప్పుకుంటాడు. నా కొడుకు—నా చెప్పుచేతలలో పెరిగాడు. నా మాట వినకేంజేస్తాడు? ఈ వేసవిలోనే ఆ పెళ్ళి చేసితీరుతాను. ఆ కట్నం డబ్బుతో ఓ పదిహేనకరాలొస్తాయి" అని ఇక్కడ ఆయన వ్యూహించుకొంటూంటే అక్కడ కొడుకు మరో విధంగా చేశాడు.

## 2

గుమ్మం ముందు ఆగిన బండిలోనుండి ముందు రఘు దిగి ఓ సూట్‌కేస్‌తో లోపలికొచ్చాడు. అంతపని చేసికూడ ఇంత ధైర్యంగా ఇదివరకువలెనే చిరునవ్వు చిందులాడే

ముఖంతో లోపలికొస్తూన్న కొడుకును చూచి ఆశ్చర్య పోయాడు తండ్రి గంగాధరం. అతడి వెనకనే తలవంచుకుని మెల్లగా నడుస్తూన్న అమ్మాయిని చూచి ఆశ్చర్యపోయింది తల్లి.

అలా నోట మాటలేకుండా కళ్ళప్పగించి చూస్తూ ఊరుకుంది. సీతమ్మ సాధారణంగా అట్లా మాటాపలుకూ లేకుండా చూస్తూ ఊరుకునే పరిస్థితులు రెండే రెండు. ఒకటి, బాగ కోపంవచ్చి అనరాని మాటలన్నీ అన్నాడని, రెండు.. ఏనాటినుండో తన మనస్సులో స్థిరనివాసం ఏర్పరచుకొన్న ఉద్దేశాలు ఒక్కసారిగా అబద్ధమని రుజువైనవని. ఈ రెండో కారణమే ప్రస్తుతం ఆవిడను అలా నిలబెట్టేసింది. కొడుకు తన ఇష్ట ప్రకారం ఎక్కడో పెళ్ళిచేసుకొన్నాడని వినగానే ఆవిడ నిర్ణయించుకుంది— అదెవత్తో వాడితోనే చదువుకొంటూన్న టక్కులాడై ఉంటుందని. ఆవిడ ఉద్దేశ్యంలో చదువుకున్న ఆడపిల్ల బొట్టు పెట్టుకోదు, ముందుకూ వెనకూ ఓ అర డజనుజడలైనా వేసుకుంటుందని. టిక్‌టాక్‌గా భూమ్యాకాశాలు పట్టకుండా నడుస్తుంది— వగైరాలన్నీ. కాని ఇప్పుడీ అమ్మాయి ముఖాన కొట్టొచ్చినట్టు కన్పడే కుంకుమబొట్టూ, మెళ్ళో నల్లపూసలు, పసుపుత్రాడు, నాగుబామువంటి ఒకే ఒక వాలుజడ, మెల్లగా తల వంచుకు నడుస్తున్న తీరు, సాధా రణంగా ఉన్న చీరకట్టు, కాటుక తీర్చిదిద్దిన కళ్ళతో కలకల లాడే ముఖం, పచ్చని శరీరచ్ఛాయ చూచి ఉక్కిరి బిక్కిరై

పోయింది సీతమ్మ. హిందూ స్త్రీత్వానికే ప్రతినిధిలా వున్న ఆ యువతికి వంకలు పెట్టలేకపోయింది.

మాటామంతీ లేకుండా చూస్తున్న తల్లిదండ్రులను ముందు కొడుకే పలుకరించాడు.

"ఏం అమ్మా కులాసా? నా ఉత్తరం అందిందా నాన్నా? నడవండి లోపల మాట్లాడుకుందాం" అంటూ సూట్‌కేస్ అక్కడపెట్టి రుమాలుతో ముఖం తుడుచుకుంటూ నుంచున్నాడు. ఆ అమ్మాయి గబగబ భర్త చాటునుండి ముందుకువచ్చి ప్రక్కప్రక్కల్నే నిల్చున్న అత్త మామలకు పాదాభినందనం చేసింది. కాని ఎవరి నోటినుండీ దీవన విన బడలేదు. ఆమె సౌందర్యం చూస్తూ ముగ్ధురాలై పోయిన సీతమ్మ యింకా ఈ ప్రపంచంలో పడలేదు. కాని కాస్త నిగ్రహ శక్తి గల గంగాధరం మాత్రం అయిష్టంగా వెనుకకు నాలుగడుగులు వేసి ప్రక్క గదిలోకి వెళ్ళిపోయాడు. కొడుకును అలా మందలించాలి ఇలా మందలించాలి అని అంత వరకూ లోలోపల రిహార్సల్సు వేసుకున్నా, ఇప్పుడేమిటో గొంతు ఎవరో గట్టిగా అదిమిపట్టినట్లుగా ఎంతప్రయత్నించినా నోటినుండి మాట రావడంలేదు. ఎవరో బలవంతగా తన అధికారం లాక్కున్నట్లు, ఇహ తనకా ఇంట్లో విలువలేనట్లు విచిత్రమైన భావాలతో బాధ పడుతున్నాడాయన.

ఇంతలో రఘు "భవానీ, నీవు మేడమీదకు వెళ్ళునేను వస్తాను తర్వాత. నాన్నా వదినను పైకితీసుకువెళ్ళు" అన్నాడు. ప్పెడు వదినతో చెట్టాపట్టాలేసుకు తిరుగుదామా అని

చూస్తూన్న పద్మ ఆ మాటతో వక్క గంతుతో వెళ్ళి వదిన చెయ్యి పట్టుకు మేడమీదికి వెళ్ళిపోయింది.

"భవానీ!" ఎంత చక్కటిపేరు! కొడుకునోటినుండి ఆ మాటవినగానే అసలే ఆశ్చర్యంతో నిల్చునిపోయిన సీతమ్మ ఇంకా ఇనుమడించిన ఆశ్చర్యంతో కొయ్యబారినట్లైపోయింది చదువుకొనే ఆడవాళ్లు అనగానే వాళ్ళపేర్లు అందరి మాదిరిగా సాధారణంగా ఉండవని, అసలు పిల్చేందుకే వీలుగావుండవనీ ఆవిడగట్టి నమ్మకాలంలో ఒకటి ప్రేమలత, స్నేహలత, శోభ, ప్రభ, శుభవగైరా ఫ్యాషన్ పేర్లేగాని దేవుళ్ళ పేర్లుపెట్టుకుంటారని ఆవిడ ఇంతవరకు ఎప్పుడూ కలలో కూడ అనుకోలేదు. అటువంటి వుద్దేశ్యాలతో బాధపడే ఆమెకు "భవానీ" అన్న మాట వీనులకు విందుచేసింది.

"ఏమిటమ్మా అలా చూస్తావు? ఏం, ఎవళ్ళామాతో మాట్లాడకూడదనుకున్నారా? కొమ్మంటారా వుండమంటారా ఇంతకూ?" చికాకుగా ప్రశ్నించాడు రఘు. దానితో కాస్త చలనం కలిగింది సీతమ్మకు.

"అది కాదురా. మరీ...మరీ...ఆ పిల్ల..." అంటూ అర్ధోక్తిలో ఆగిపోయింది. దానితో చికాకు ముంచుకొచ్చింది రఘుకు. ఎండలో ఇంతదూరం ప్రయాణం చేసివస్తే మంచి నీళ్ళయినా ఇవ్వలేదు. పైగా ఏమిటో ఎవళ్ళో చచ్చినట్టు దిగాలు పడిపోయి ఏడుపు ముఖాలు వీళ్ళూను—అను కొన్నాడు. ఎంత ప్రయత్నించినా కోపం దిగమింగుకోలేక పోయాడు.

"వ్వాం, ఏమిటి, ఆపిల్ల? ఆ పిల్లకేం, ఎలాకనపడుతుంది నీకు? దయ్యం, భూతం కాదు—మనిషిపిల్లే" కటువుగా అన్నాడు.

ఈ సంభాషణంతా వింటూన్న గంగాధరం సడలిపోయిన ధైర్యమంతా కూడదీసుకు రయ్యిమంటూ వచ్చాడు అక్కడికి.

"సంతోషించాం లేవోయ్, బోడిప్రయోజకత్వానికి చేసిన పనికి సహాం వచ్చినట్టు నోరు మూసుకోక పైగా ఏమిటి తెగవాగుతున్నావ్? ఎవడు నేర్పుతాడివన్నీ? మనిషి పిల్లని కాకపోతే కుక్కపిల్లనీ, ఏనుగుపిల్లని చేసుకుంటావా? ఇంతకూ అదెవరు?—ఈగజపత్రోళ్ళ అర్హతవుందా, లేదా అని? తెలిసిందా?" ఒక్కొక్కమాటే నొక్కి నొక్కి అంటూ కొడుకు ముఖంలోకి చూశాడు గంగాధరం.

"నాకు నచ్చినపిల్ల—కులమతాలతో నాకనవసరం. చేసుకు తీరాలని నే నేనాడో అనుకున్నాను, చేసుకున్నాను. ఏకులమో తెల్సుకోవాల్సిన అవసరం నాకు లేదు. నాతోనే ఎమ్. ఏ. చదివింది. చదువుకు చదువు, తెలివికి తెలివి, తగిన అందం, గుణం వున్నాయి. నా కవిచాలు."

"ఏమిటి?" అంటూ బుగ్గలు నొక్కుకుంది సీతమ్మ.

"వీడి తలతిరుగుడేమిటో యిప్పుడే అంతు తేలుస్తానుండు. గౌరవం, మర్యాద తర్వాత సంగతి" అంటూ ఒక్క ఉదుటున మేడమీదికి వెళ్ళాడు గంగాధరం.

మేడమీద పెద్దగదిలో భవానీ, పద్మ నేలమీద

కూర్చుని ఏమిటో ఏనాటినుండో, ఒకారికొకరు బాగా తెలిసినట్లు మాట్లాడేసుకోవడంచూస్తే గంగాధరానికి ఆశ్చర్యమేస్తుంది. ముఖ్యంగా అంత ఎమ్. ఏ. చదివిన అమ్మాయి అందరిలాగ నేలమీద కూర్చున్నందుకు. మామగారిని చూచి భవానీ లేచి నిల్చుంది. పద్మనిలువెల్లా ఒణికి పోయింది.

"ఏ కులస్థు లమ్మాయి మీరు?" అంటూ సూటిగా ప్రశ్నించాడు. కాని ఆ ప్రశ్నకు ఆ అమ్మాయి సమాధాన మివ్వలేదు. ఒక్కసారి కళ్లెత్తి చూచి వెంటనే వాల్చేసింది.

"ఏ ప్రాంతు మీది?" అన్నాడు కాస్త గట్టిగా.

"కృష్ణలంక... బెజవాడ" అంది సన్నగా.

అదివిని ఉలిక్కిపడ్డాడు గంగాధరం—అతనిస్వగ్రామం అదే.

రఘు సీతమ్మ కూడ వచ్చారక్కడకు.

"నే చెప్పలేదూ భవాని—ఇక్కడికొస్తే అగ్నిపరీక్షకు నిల్చోవాల్సి వస్తుందని. విన్నావా నామాట?" అన్నాడు రఘు.

భవానీ నవ్వుతూ తలెత్తిచూసింది. "జీవితమే ఒక అగ్నిపరీక్ష లెండి—భయమెందుకు" అంటూ అత్తగారికి దగ్గరగావచ్చి అంది.

"మీరేమీ ఆ విషయంలో విచారించ నక్కర్లేదు అత్తయ్యా నేనూ కమ్మవారి అమ్మాయినే......మాకు ఆ

విషయాలలో అంత పట్టింపు వుండక చికాకుగావుంటుంది. కాని పెద్దలకు అదే ముఖ్యం." అంది.

దాంతో సీతమ్మ ప్రాణం కుదుట బడింది. కాసేపటికంగా ధరానికింకా కోపం చల్లారలేదు. భవానీ నుద్దేశించి అన్నాడు—

"కృష్ణలంక అంటున్నావు ఎవరమ్మాయి వేమిటి?"

భవానీ ఏదో చెప్పేలోగా రఘు అడ్డువచ్చాడు. "ఇదుగో భవానీ, నువ్వు లోపలికి వెళ్ళు" అన్నాడు. భవానీ వెళ్ళిపోయింది. రఘు తండ్రివైపు తిరిగి అన్నాడు—"మీకు నిజంగా కొడుకు, కోడలుకావాలనీ, విషయాలన్నీ తెలుసుకోవాలనీ వుంటే ప్రశాంతంగా, ఆదరణతో అడగాలికానిదిక్కు, తికానా లేనివాళ్ళ నడిగినట్టు ఆ నిలదీయడమేమిటి? మీకే కాదు, మాకూ ఉంటాయి, పట్టుదలలు, అభిమానాలూను. దారినపోయ్యే వాడికైనా ముందు కూర్చోవస్తే ఎంతో మర్యాదచేస్తారు. ఈ యింట్లో మాత్రం కొడుకు, కోడలు వచ్చినా మంచినీళ్ళిచ్చేదిక్కు కూడా లేకపోయింది. తెలిసి వుండీరావడం మాదే బుద్ధితక్కువ. పద భవానీ పోదాం" అంటూ కోపంగా మెట్లుదిగబోయాడు.

సీతమ్మ గట్టిగా కొడుకు చెయ్యిపట్టుకుంది వెళ్ళనీకుండా.

"ఎవరిమట్టుకు వాళ్ళే అట్లాతొందరపడ్తే ఎలాబాబూ, వెళ్ళే నామీద ఒట్టే" అంటూండగా రఘు పాదం ముందుకు

కదల్చలేకపోయాడు. చిన్ననాటినుండి తండ్రికంటే తల్లిమీదే ఎక్కువ గౌరవం ఆతడికి.

"వాళ్ళూ పాపం అలసిపోయి వచ్చారు ప్రయాణంలో. కాస్త స్థిమిత పడనివ్వండి, వాడే చేస్తాడు" అంటూ భర్తను బలవంతంగా క్రిందికి తీసుకెళ్ళింది సీతమ్మ.

"కులంలో పిల్లేసటగా మాట్లాడకూరుకోండి, ఏం చేస్తాం. వాడూ మనిషంత మనిషయ్యాడు!" అంది రహస్యంగా. మనస్సులో కోపంగా వున్నా గంగాధరంగారికూడ అంతకంటే ఏమీ ఉపాయం తోచలేదు. కోపం చల్లార్చుకోవడానికి బయటకు వెళ్ళిపోయాడు.

## 3

"ఎందుకా అబద్ధం భవానీ. అబద్ధాలెన్నాళ్ళు దాగుతాయి?" అన్నాడు రఘు.

ఆశ్చర్యంగా కళ్ళెత్తింది భవాని. ఆ ప్రశ్నమిటో ఆమె కర్థం కాలేదు. "నేనెన్నడూ అబద్ధమాడను. అయినా ఏ విషయం మీరనేది?" ఇంతలో పద్మ కాఫీ తీసుకురావడంతో ఆ సంభాషణ అంతటితో ఆగిపోయింది.

"నాన్నగారెక్కడికో వెళ్ళారు. ఇంట్లో లేరు. క్రిందికి దా అన్నయ్యా స్నానం చేద్దువు గాని, నీవుకూడ దా వదినా

స్నానం చేస్తే బడలిక తీరుతుంది" అంటూ ఇద్దర్నీ క్రిందికి తీసుకువెళ్ళింది పద్మ.

పావు గంటలో స్నానం ముగించి, బట్టలు మార్చి వంటగదిలోనికి వచ్చింది భవానీ. సీతమ్మ పొయ్యిదగ్గర కూర్చుని వంట చేస్తూంది. ఒక ప్రక్కగా కత్తిపీట వేసుకొని కూరలు తరుగుతోంది పద్మ.

"ఇక్కడిలా కూర్చోండి అత్తగారూ. మేమిద్దరం చేసేస్తాం" అంటూ భవాని అత్తగారి చేతిలో గరిట తీసుకుంది.

సీతమ్మ అలా మంత్రముగ్ధలా చూస్తూ ఉండిపోయింది. "చదువుకొన్న ఆడపిల్ల వంటింట్లో అడుగెట్టడమే! ఆవిడ కలనైనా నమ్మలేని విషయం అది! ఆశ్చర్యం వెలిబుచ్చుతూన్న ఆమె నేత్రాలలోని అంతరార్థం కనిపెట్టి లోలోన నవ్వుకుంది భవానీ.

"నాకు వంట చేయడం వచ్చును. అవసరమైతే మీరు చెప్తూందురు గాని ఇలా కూర్చోండి" అంటూ దూరంగా పీటవేసి అత్తగార్ని చేత్తో లేవదీసి కూర్చోపెట్టి తాను పొయ్యిముందు కూర్చుని పనిలో నిమగ్నమైంది.

సీతమ్మగారి ఆశ్చర్యానందాలకు అంతులేక పోయింది. కళకళలాడుతూ లక్ష్మిదేవిలా వున్న భవానీని, ఆమె వినయ విధేయతలను చూస్తూ అటువంటి కోడలు దొరకడం తన అదృష్ట మనుకొంది. ఏమైనా—రఘు తెలివైనవాడే చేశా

నవ్వించింది. అంతకుముందు అతడి మీదనున్న కోపమంతా క్షణంలో హరించిపోయింది. లోలోపల ఆ అమ్మాయి పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవాలని మహా కుతూహలంగా వున్నా లోతుగుండే మనిషి కావడంవల్ల తొణకకుండా కూర్చుంది. వాళ్ళెప్పుడు చెప్తారో అప్పుడే విందామన్నట్లుగా.

అలాగ ఒక పావుగంట గడిచిపోయింది. కాని ఎవ్వరూ మాట్లాడలేదు. ఎవరి ఆలోచనలతో వారున్నారు. అన్నం వార్చేసి భవాని చావడిలోకి వెళ్ళింది. తనతో తెచ్చుకున్న సూట్ కేస్ తెరిచి ఏవో బట్టలు తీసి స్నానాలగదివైపు వెళుతూంటే, అప్పుడే రఘు అటునుంచి వస్తూ ఎదురుపడ్డాడు.

“ఇవిగో నీ బట్టలు. ఇంకేమైనా కావలిస్తే తాళం చెవి ఇదిగో. మళ్ళీ నాకిచ్చెయ్యండి. ఎక్కడా పారెయ్యక” అంది.

నవ్వుతూ అందుకున్నాడు రఘు.

ఆ దృశ్యం చూడగానే సీతమ్మ ముఖం విప్పారింది. “కొడుకుతో సమంగా ఎమ్. ఎ. చదివిన కోడలు మామూలు గృహిణికి మల్లేనే ఇటు వంట పని చూస్తూ అటు భర్తను ఏం కావాలో కనుక్కుంటూంది! ఈ యింట్లో ఒక్కగంట క్రితమే అడుగెట్టినా క్రొత్త అనే సంకోచమే ఉన్నట్లు కనపడడం లేదు. అన్నిటికంటె గొప్ప విషయం — ఆమె భర్తను “మీరు” “అండీ” అని మన్నిస్తోంది. చదువుకొన్న స్త్రీలు భర్తను పేరెట్టి పిలుస్తారని, “నీవు” అంటారనీ ఆవిడ ఉద్దేశం. చదువు కొన్న ఆడపిల్లలపట్ల ఆమెకుగల దారుణ భావాలలో యింత

వరకు ఏ ఒక్కటి నిజం కాకపోయేసరికి అసలిదంతా కలా నిజమూ అనిపించసాగింది.

చకచకా అరగంటలో పనంతా ముగించివేసింది భవానీ. అందరూ ఇవతలకొచ్చి సావిట్లో కూర్చున్నారు. రఘు ఎవరో స్నేహితులింటికి వెళ్ళిపోయాడు. ప్రక్కింటి సరస్వతి వచ్చి క్రొత్త మనిషిని చూచి అలాగే నిల్చుండిపోయింది. రోజూ ఆ సమయంలో లోకాభిరామాయణం మాట్లాడటం ఆవిడ కలవాటు.

"ఈవిడెవరు సీతమ్మా?" అంది.

చెప్పనా, వద్దా అని తనలో తాను తికమక పడ్తోంది సీతమ్మ. పరిస్థితిని గమనించింది భవానీ. గబగబ అక్కడే వున్న సూట్‌కేస్ తెరచి ఒక పుస్తకం తెచ్చింది.

"ఏం తోచటం లేదు. భారతం చదువుతాను. కాస్సేపు వినండి. మీరు కూర్చోండి పిన్నిగారూ" అంటూ ఇహ ఎవరికీ నోరు మెదపేందుకు అవకాశ మివ్వకుండా పుస్తకం తెరిచింది! తెరచీ తెర్వడంతోనే అరణ్యపర్వం చతుర్థాశ్వాసంలో భీమసేనుని బంధించిన నహుషుని ప్రశ్నలకు ధర్మరాజు జవాబులిచ్చే ఘట్టం వచ్చింది. అదే రాగయుక్తంగా చదవడం మొదలెట్టింది. ఆమె యుక్తిని కనిపెట్టిన సీతమ్మ కిక్కురుమనకుండా వూరుకుంది. "సినిమా పోకిళ్ళుపోయే ఈ కాలపు పిల్లలకు భారత భాగవతాలు కూడా తెలుసునా" అనే ఆశ్చర్యంతో అట్టే నోరావలించి చూస్తూ ఉండిపోయింది ఆ పొరుగావిడ.

"ఘనుండు ఏ గుణములు గలవాడు బ్రాహ్మణుం డతని కెరుగదగిన యట్టి వస్తువెద్ది దీని నాకు నెరింగింపుమనిన నిట్లనియెం జెప్పెం బాండవాగ్రజుండు."

అప్పుడే గుమ్మంలో అడుగెట్టిన గంగాధరం అది విని విస్తుపోయాడు.

'లోపలికి వెళ్దామా, వద్దా?' అని కాస్సేపు తటపటాయించి ఆఖరుకు అదేమిటో పూర్తిగా విందామని ఏమాత్రం చప్పుడు కాకుండా వీధి అరుగు మీది గదిలోకి పోయి కూర్చున్నాడు. లోపలివారికెవరికీ అతడొచ్చినట్టు తెలియలేదు, ఆగదిలో అప్పుడే సంధ్య చీకట్లు అలుముకోవడంవల్ల. కాని కిటికీగుండా వారందరూ అతనికి కన్పిస్తూనే వున్నారు. పొదుపుగా కూర్చుని ఒడిలో పుస్తకం చూస్తూ కమ్మటి కంఠస్వరముతో రాగయుక్తంగా పద్యం చదివిఅర్థం చెప్తూన్న అపరసరస్వతీ దేవిలా ఉన్న భవానిపై కోపం తెచ్చుకోడానికతడికి మనస్కరించడంలేదు. కాని కొడుకు ముప్పైవేల కట్నం కాలదన్నాడు—తన పెద్దరికాన్ని గౌరవించలేడే అన్నబాధ ఒకప్రక్క దహించివేస్తోంది. ద్వంద్వావేశాలతో సతమత మౌతున్నాడు ఆ చీకటిగదిలో.

చదివిన పద్యానికర్థం చెప్పి రెండో పద్యం మొదలు పెట్టింది భవానీ.

"సత్యక్షమాదమ శౌచ దయా తపోదాన
శీలంబు లెందేనిగాన
నగుచున్నవాఁడు బ్రాహ్మణుఁడగు సుఖము
దుఃఖంబు వైనెడ విమోహమును బొంద
కునికియా వానికి నుత్తమం బగు వేద్యమనిన
ని చెప్పిన యుగ్గుణములు
క్షత్రియ వైశ్య శూద్రునందుఁ గల్గిన నతం డుత్తమ
ద్విజుఁడుగా నేర్పునే నిజము విడిచి.

పులిక్కిపడ్డాడు గంగాధరం ఆ పద్యం విని. కులమత భేదాల పట్టింపుతో బాధపడే అతడికి దెబ్బకొట్టినట్టయింది. ఇహ అక్కడ కూర్చోలేక లేచి గది దాటి వస్తూంటే అప్పుడే నవ్వుతూ వీధి గడపదాటి వస్తూన్న రఘు ఎదురయ్యాడు. పద్యంలో ఆఖరి పాదం అతడికీ విన్పించింది. ఏదో ఛలోక్తి విసురుదామనుకొంటూ వస్తూన్న అతడు తండ్రిని చూచి పులిక్కిపడ్డాడు. దొంగలాగ చీకటిగదిలోనుంచి వస్తూన్న గంగాధరం కొడుకుని చూచి పులిక్కిపడ్డాడు. తలలు దించుకుని ఒకరు వెనుక ఒకరు లోపలికెళ్ళారు. వారిని చూడగానే పొరుగింటావిడ లేచి వెళ్ళిపోయింది. భవాని పుస్తకం మూసేసి అత్త గారితో కలిసి లోపలికి వెళ్ళిపోయింది. దూరాన గుడిగంటలు గణగణ మ్రోగాయి.

# 4

రాత్రి అందర్నీ కూర్చోబెట్టి భవానియే వడ్డనచేసింది. తండ్రీ, కొడుకు ప్రక్క ప్రక్కనే కూర్చుని భోంచేశారు — కాని ఎవ్వరూ ఒక్కమాటైనా మాటలాడలేదు.

రఘూ భవానీ మేడమీదకు వెళ్ళిపోయారు. గంగాధరం అన్నాడు, భార్యతో "ఏమిటే సంగతి? అప్పుడే కోడలు చేత భారత, భాగవతాలు చదివించుకుంటున్నావు?"

ఆ మాటలు కోపంగా అన్నాడో ప్రేమగా అన్నాడో సీతమ్మకు అర్థంకాలేదు. కాని కోడలిసంగతి ఎత్తేప్పటికి ఆమె ఆనందం అవనులు దాటిపోయింది.

"ఏమైనా కానీండి—— ఇటువంటి కోడలు దొరకడం ఎంత అదృష్టం! అప్పుడే వచ్చి ఓ రోజైనా కాలేదు. మనలో కలిసిపోయింది. ఆ పనిపాటలు, ఆ చలాకీతనం, ఆ కలుపుగోలుతనం కావాలంటే వస్తాయా? అంత చదువుకొనికూడ ఏం వినయం విధేయత! కళకళలాడుతూ ఆ లక్ష్మీదేవే మనింటికి దిగివచ్చినట్టుంది కాని సాధారణంగా కన్పించడంలేదు నా కంటికి.

ఆమెతో సమంగా సంతోషించలేకపోయాడు గంగాధరం. "ప్చ్, పుట్టుపూర్వోత్తరాలు తెలియవు కదా ఏం లాభం? పెళ్ళి మన చేతులమీదుగా జరగలేదు. నలుగురి

తోను ఏమని చెప్పడం......? ముప్పైవేలు! ముప్పై రూపాయలుకూడ ఎవడూ బదులివ్వడే? అటువంటిది ముప్పైవేలు కట్నం వస్తుందని నేనాశపడితే ఇలాగైంది" అంటూ నిట్టూర్చాడు.

అతడంత జాలిగా మాట్లాడుతూంటే చూడడం అదే ప్రథమం సీతమ్మగారికి. అతగాడి గంభీరత్వమంతా ఏమై పోయిందో అని ఆశ్చర్యపోయింది.

"ఏమిటండీ మరీ అలా దిగులుపడిపోతారు. ముష్టి ముప్పైవేలకు అంత ఇదైపోతారేమిటి? మనకు లేకపోతేకదా ఒకళ్ళిచ్చేదానికోసం ఆశపడటం? ఆ పిల్లే లక్ష కట్నం మనకు. తర్వాత తర్వాత అన్నీ వాడే చెప్తాడు. ఏదో కుర్రతనాలు కాస్త పెంకితనం. ఈ కాలంలో ఎందరు చేసుకోవటం లేదు గనుక, అటువంటి పెళ్ళిళ్ళు? ఎవరునవ్వుతారు? నవ్వితే నవ్వనిండి, మనకేం?" గంగాధరం ముందు ఇదివరకు జీవితంలో ఎన్నడూ మాట్లాడనంత స్వేచ్ఛగా మాట్లాడుతోందీ వేళ సీతమ్మ.

భవానీ డాబామీద కూర్చుని దూరాన వెన్నెలలో మెరిసి పోతూన్న సుబ్రహ్మణ్యేశ్వరాలయ గోపురం చూస్తోంది. అక్కడే పడుకొన్న రఘు పున్నమిచంద్రమామను తదేకంగా చూస్తున్నాడు. క్రిందదొడ్లోవున్న మాలతీపూలు విరజిమ్ముతూన్న సువాసనలకు భవాని జడలోని మల్లెపూల పరిమళం తోడైంది.

"దేవాలయమున వినబడునదిగో— ఆకసమున కన బడునదిగో" దూరాన రేడియో సన్నగా పాడింది.

"భవానీ" అన్నాడు రఘు మెల్లగా చందమామ మీది నుండి దృష్టి మరల్చుతూ.

"ఊఁ" అంది పరధ్యానంగా భవానీ.

"ఏమిటాలోచిస్తున్నావు?"

"ఏమీలేదు......మీరు కథలెంత బాగా అల్లగలరో అని—"

"నేనా?......కథలా?" అంటూ హడావుడిగా లేచి కూర్చున్నాడు రఘు ఆశ్చర్యంగా, భవానీ పకపకా నవ్వేసింది అతడితత్తరపాటు చూచి.

"ఏమిటి నువ్వనేది?" అన్నాడు తనుకూడ చిన్నగా నవ్వుతూ.

"ఇక్కడికొచ్చేముందు మీ రెన్ని చెప్పారు?— నాన్నగారు అలా తిడతారు—అమ్మ ఇలాగంటుంది— అంటూ, తీరావస్తే ఏమీలేదు. ఎంత మంచివారు ఈఇంట్లో అందరూ కూడా! మామగారు ముందు కోప్పడినా ఇప్పుడు బాగానేవున్నారు. పద్మ మనం వచ్చినది లగాయతు నన్ను వదిలిపెట్టనేలేదు. అత్తగారి సంగతి సరేసరి—అంతటి శాంత మూర్తి ఎక్కడైనా వుంటుందా!"

"నేనూ అదే ఆశ్చర్యపోతున్నాను. తిన్నగా వచ్చిన దారి పట్టాల్సివుంటుం దనుకున్నాను. నువ్వేం మంత్రం

వేళావో మరి! ఈ సాయంకాలం వచ్చావో లేదో — అప్పుడే ఇల్లంతా హస్తగతం చేసుకొన్నావు. అత్తగార్ని పురాణం వింటూ ఓ ప్రక్కన కూర్చోమన్నావు. ఎంతైనా చదువుకున్న కోడలివి!" అన్నాడు చమత్కారంగా.

"మీకేం మంత్రం వేశానో వారికీ అదే వేశాను. మంత్రగత్తెనుకదూ నేను?" అంది భర్త కొంటెతనానికి తన పరిహాసం జోడిస్తూ. ఇద్దరూ నవ్వుకొన్నారు. మళ్ళీ కాస్సేపు నిశ్శబ్దం ఆవరించింది. రేడియో సంగీతం ఇంకా విన్పిస్తూనే వుంది.

"సత్య రూపము దేవుడేనమ్మా——సత్యమెప్పుడు గెలిచి తీరమ్మా?"

"……"

అది వినగానే మధ్యాహ్నం సంగతి గుర్తుకొచ్చింది. భవానికి.

"మధ్యాహ్నం అబద్ధమంటున్నారేమిటి?" అంది.

"అదే నీవు చెప్పిన విషయం——కమ్మనారమ్మాయినే అంటున్నావుకదూ. ఎన్నాళ్ళు దాస్తావు?"

"………"

సమాధానం రాలేదు భవానీనోటనుండి. అరచేతికితల ఆనించి పడుకొంది. రెండో చేత్తో ఏవో పిచ్చిగీతలు గీస్తూ.

"మాట్లాడవేమిటి భవానీ" అన్నాడు ఆశ్చర్యంగా.

"మీరు క్షమిస్తానంటే——ఒక్క సంగతి చెప్తాను" అంటూ అతని కళ్ళల్లోకి చూసింది. అతడి ముఖం ఎప్పటి

మాదిరిగా ప్రశాంతంగా, గంభీరంగా వుండటం ఆ వెన్నెల్లో స్పష్టంగా కనబడింది.

"అదేమిటి భవానీ, ఇవాళేదో క్రొత్తధోరణిలో పడ్డావు." అన్నాడు వింతగా చూస్తూ.

"నిజమే, మేమూ కమ్మవారమే. కృష్ణాజిల్లా మా..."

ఆమె మాట పూర్తికాకుండానే రఘు అడ్డువచ్చాడు.

"అవును భవానీ, అంతేలే. అవును. ఒకే కులమైతే బాగానే వుంది. పెద్దలు సంతోషిస్తారు. కాని నాకనవసరం అవన్నీ... నీవుకూడా అందరిలాంటిదానిగానే నన్నర్థం చేసుకోలేదన్నమాట! అన్యకులంలో పిల్లను పెళ్ళిచేసుకొని సంస్కర్తనన్న కీర్తి గడించుకోవాలనుకోలేదు నేను. నాకు కావలసినవి పేరు ప్రతిష్ఠలు కాదు—నీతివర్తన, సుఖశాంతులు అవి ఎవరిదగ్గర లభ్యమవుతాయో ఆ వ్యక్తికోసం వెదికాను, దైవానుగ్రహం వల్ల దొరికింది—అదే చాలు; నాకు వ్యక్తి ముఖ్యంకాని, ఆమె పూర్వాపర చరిత్ర, కుటుంబస్థితి, వంశప్రతిష్ఠ, కట్నం కానుకలుకాదు. రాళ్ళలో రత్నాలూ వుంటాయి, మాణిక్యాలలో మసిబొగ్గులూ వుంటాయి — ఈ సంగతి తెలియకే ప్రపంచంలో ఇన్ని బాధలు.

"మట్టిలో నుండి రానీ, లేక, మహాలులోనుండి రానీ ఏమైనా నాక్కావలసిన మనిషి నాకు లభించిందికదా – ఇహ ఆలోచన దేనికి? తెలుస్తోందా భవానీ? దాంపత్యమంటే సాధారణంగా మనుష్య ప్రపంచంలో చూచే కోపతాపాలు, అమానుషకృత్యాలు, అహంకారపూరిత అధికారాలు కాదు. జీవితాంతంవరకు

అనుక్షణం సుఖదుఃఖాల్లో, బరువు బాధ్యతలలో ఒకరి కొకరం తోడునీడగా వుండాలి. కోపగించటం క్షమించటం వంటి మాట లింకెప్పుడూ నాదగ్గర అనకు.

"ఈ ప్రపంచంలో నీవు నాకు ఆప్తు లందరికంటే ఆప్తురాలవు. ప్రాణస్నేహితులందరికంటె ప్రాణప్రదమైన దానవు. ఒక్క మాటలో చెప్పాలంటే దేహాలు వేరైనా మన ఇరువురి ప్రాణం ఒకటి. ఇద్దరం ఒకేమాటతో ఒకేబాటపైన నడవాలి. అది పూలబాటో. ముండ్ల బాటో మన తెలివి, అదృష్టం నిర్ణయిస్తాయి."

భర్తమాటలు వింటూన్న భవానీ ఆనందం అవధులు దాటిపోయింది. "మీరు నిజంగా దైవ స్వరూపులు ప్రపంచంలో అదృష్టమంటే..."

"నాది" అని పూర్తి చేశాడు రఘు ఆమెను సమీపిస్తూ,

"మధుర మధుర మీ చల్లని రేయీ" రేడియో ఇంకా పాడుతూనేవుంది.

# 5

చల్లటిగాలి వీస్తోంది. ఇంకా అరుణోదయం కాలేదు. సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో గంటలు భక్తుల మేలుకొలుపు

భజనలతో మిళితమై విన్పిస్తున్నాయి. అప్పుడే మేల్కొం టూన్న ప్రకృతి చిత్రమైన సందడి చేస్తోంది.

గంగాధరం అప్పుడే మేల్కొన్నాడు. భవాని శ్రావ్య కంఠం విన్పిస్తోంది.

పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన
స్వయమ్
వ్యాసేన గ్రథితాం పురాణ మునినా మధ్యే
మహాభారతమ్
అద్వైతామృత వర్షిణీం భగవతీ మష్టాదశా
ధ్యాయినీమ్
అంబ, త్వామను సందధామి భగవద్గీతే,
భవ ద్వేషిణీమ్.

కోడలు తెల్లవారుఝామునే లేచి భగద్గీత పారాయణ చేస్తోంది! వయస్సంటే చిన్నపిల్లే— పైపెచ్చు ఇంగ్లీషు చదువులు చదివింది! కుతూహలం ఆపుకోలేక కొడుకు గదిదగ్గరకు వచ్చాడు. తలుపులు ఓరగా వేసివున్నాయి. భవానీ చదువుతూనే వుంది.

నమోస్తుతే వ్యాస విశాల బుద్ధే
ఫుల్లార విందాయత పత్ర నేత్ర,
యేనత్వయా భారత తైలపూర్ణః
ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః

పెల్లుబికి వస్తూన్న ఆశ్చర్యానందాల నణచుకోలేక, యుక్తాయుక్త జ్ఞానంకూడా మరచిపోయి తలుపులు తోసి లోపలకు వెళ్ళాడు. మందిరంలో వేణుగోపాలస్వామి విగ్రహం పారిజాతాలతో పూజచేయబడి ఉంది. పాదాలదగ్గర ఇంకా నీరాజనం వెలుగుతోంది. ఆ విగ్రహానికి అభిముఖంగా చాప మీద కూర్చుని భగవద్గీత చదువుతోంది భవాని. తల స్నానం చేసినట్టుంది. జుట్టు చిందరవందరగా విరబోసుకుని ఉంది. రెండు కొండల నడుమనుండి అరుణకాంతులను వెదజల్లే బాలభాస్కరునిలా వుంది అందమైన కనుబొమలకు కొద్ది పైగా వున్న తిలకం.

కొద్ది దూరంలో మంచంమీద పడుకుని రఘు వింటున్నాడు.

గంగాధరం గదిలో అడుగెట్టగానే భవాని ఉలిక్కిపడి చూచి లేచి నిల్చుంది ఖంగారుగా. రఘు కళ్ళు మూసుకుని నిద్ర నటించసాగాడు. అది దొంగనిద్రని గ్రహించలేనంత అమాయకుడు కాడు గంగాధరం. తనలో తాను నవ్వుకున్నాడు. అతని మనస్సు పూర్తిగా ఆనందంతో నిండి

పోయింది. చిన్న వయస్సులోనే ఇంతమంచి అలవాట్లున్న కోడలిని చూచి.

"భగవద్గీత విన్పిస్తోంటే చూద్దామని వచ్చాను. చదువుకోమ్మా చాల మంచి గ్రంథమది...... అప్పుడే ఎప్పుడు లేచావు. స్నానం, పూజకూడ అయిపోయాయి!" అన్నాడు వాత్సల్యం ముట్టిపడే కంఠంతో.

"ఒక అరగంటైందండీ" అంది భవాని తలవంచుకునే.

"కూర్చోండి" అంటూ కుర్చీ వాల్చింది. కూర్చు న్నాడు గంగాధరం.

"భగవద్గీత వినడంలో తప్పు లేదురా. ఆ దొంగ నిద్రెందుకు? లేచి కూర్చో" అన్నాడు చిరునవ్వుతో కొడు కును చూస్తూ.

రఘు లేవలేదు.

"నిన్నేరా" అంటూ తండ్రి రెట్టించాడు.

ఇహ రఘుకు లేవక తప్పలేదు. లేచికూర్చుంటూ భవానిని దొంగచూపుల్తో చూచాడు. ఆమె క్రీగంటచూస్తూ చిరునవ్వు నవ్వింది.

"అలా కూర్చోమ్మా" అన్నాడు గంగాధరం కోడలి నుద్దేశించి.

ఆమె చాపమీద కూర్చుంది.

"అయితే రోజూ ఇలా లేచి పూజ చేస్తుంటావా?"

భవాని తలవూపింది మౌనన్నట్లు.

"స్నానం పూజ అయితేనేకాని మంచినీళ్ళు కూడ

ప్రాగడు. భగవద్గీత, భాగవతం కంఠత వచ్చును. చదువుల్లో కూడ ఎప్పుడూ ఫస్టు మార్కులే" అన్నాడు రఘు.

గంగాధరం కళ్ళు పెద్దవి చేశాడు ఆశ్చర్యంతో. "ఏమిటే? ఎవరిదగ్గర నేర్చుకున్నావమ్మా ఇవన్నీ?"

"మా తాతగారిదగ్గర నేర్చుకున్నానండి. ఆయననిత్యం పూజలతోను, భారత, భాగవతాలతోనే కాలక్షేపంచేస్తారు. అందువల్లే నాక్కూడ అలవాటైంది."

"మీ తాతగారి పేరేమిటి?"

"కొమ్మారెడ్డి పెదశీతయ్యగారు."

"ఆ!" అంటూ కుర్చీలోంచి ఎగిరిపడ్డాడు గంగాధరం. అప్పుడే నిద్రలేచి వెళుతూన్న సీతమ్మ అదేమిటోనని లోపలి కొచ్చింది.

"విన్నావటే ఆ అమ్మాయి మా సరస్వతి కూతురట! మా పెదనాన్న మనుమరాలు!" అంటూ పొలికేక పెట్టాడు గంగాధరం.

"ఎంత నాటకమాడారే, మా అమ్మా? యీ సంగతి సంగతి ముందేచెప్తే కాదూ?" అంది సీతమ్మ బుగ్గలు నొక్కు కుంటూ.

ఒకరినొకరు విస్తుపోతూ చూచుకొంటూన్న రఘు, భవానీలింకా ఆశ్చర్యంనుండి తేరుకోలేదు.

"ఏమిట్రా అలా చూస్తావ్, మీ నాటకం తెలిసి పోయిందనా?" అన్నాడు గంగాధరం.

. . . . .

"పెళ్ళి మా చేతులమీదుగా జరిపించే అదృష్టం లేకపోయింది" అంది సీతమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకొంటూ.

"ఎలా వుంటుంది? దేని—నా ఓర్పు ఉడాలి అసలు ఏ విషయం చెప్పేందుకైనా మీ రవకాశమిస్తేనా ?...... అదీకాక నాకూ ఆ వివరాలేమీ తెలియవు. నేనూ యిదే వినడం" అన్నాడు రఘు.

"ఏమిటీ! నిజంగా ఈ విషయాలేమీ తెలియవటనా?" తల్లీ, తండ్రీ ఒక్కసారే అరిచారు.

"ఔను. నాదెప్పుడూ ఒక్కటే మాట. నాకు మనిషే ముఖ్యం, మిగిలిన విషయాలన్నీ వింటే మళ్ళీ మనసెలా మారుతుందోనని, ఆ సంగతులు చెప్పేందుకు అవకాశమీయ లేదెప్పుడూ."

"అయితే నీకూ తెలియవా అమ్మాయి అవన్నీ?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

"నాకూ అవసరం లేదండి అవన్నీ. అంచేత ఎన్నడూ అడుగలేదు... కులంమాత్రం తెలుసు... ఆయన పేరులోనే వుందిగా 'చౌదరి' అని" అంది భవానీ.

"అయితే మీ తాత ఇవన్నీ తెలియని పరాయివాడికే పిల్లనిచ్చేశాడా?"

"నాకిష్టమైతే తాతగారి కభ్యంతరం లేదండి. కాలాన్ని బట్టీ పిల్లల అభిరుచుల్నిబట్టీ నడచుకోవాలనే సిద్ధాంతం ఆయనది. అదీకాక తాతగారిది చాల విపరీతమైన వైరాగ్య

ధోరణి. మా అమ్మా నాన్న చనిపోయిన కొద్ది కాలానికే అమ్మమ్మకూడా పోయిందట. అప్పుడు స్వగ్రామంవదలి నన్ను తీసుకు కాశీ వెళ్ళిపోయారట. అప్పటినుండి ఇప్పటివరకు అక్కడే విశ్వేశ్వరాలయానికి దగ్గరలోనే గంగానది ఒడ్డున ఒక చిన్న యింటిలో వుంటున్నాం. జ్ఞానమొచ్చిన దగ్గర్నుంచి ఆ తాతగారే నాకు సర్వస్వం. ఒకప్రక్క బళ్లో చదివిస్తూ ఇంట్లో స్వయంగా సంస్కృతం నేర్పి పురాణగ్రంథాలు చదివించేవారు. "నీకోసం యిక్కడున్నానుకాని లేకపోతే ఏ హృషీకేశమో పోయి తపస్సు చేసుకుంటూ వుండేవాణ్ణి" అంటూండేవారు తాతగారు" కంఠం గద్గదమైంది. జలజలా కన్నీళ్లు రాలాయి, కళ్లు తుడుచుకు మళ్ళీ మొదలెట్టింది.

"రానురాను ఆయన వైరాగ్యం అధికమైపోయింది. దానితోపాటు నా వయస్సుకూడా అధికమౌతూంటే ఆయనకు గుండెలమీద కుంపటివున్నంతగా బాధపడేవారు. ఆయన వైరాగ్యపథంలో నేనొక పెద్ద అవరోధం. సంబంధాలువెదికీ, పెళ్ళిళ్లుచేసి మళ్ళీ ఈ ప్రపంచ ధోరణిలో పడదల్చుకోలేదు. అందువల్లనే నన్నింతవరకు చదివించారు—ఈ చదువుతోను ఉన్న కొద్దిపాటి ఆస్తితోను నేను లోకంలో స్వతంత్రంగా బ్రతుకగలననే వుద్దేశ్యంతోనూ— తాను పూర్తిగా సన్యసించిపోవాలనే ఆశతోనూ...... కాని దైవ నిర్ణయం మరోకలావుంది. పేదకు పెన్నిధి దొరికినట్లు మా జీవితాలలో మీ అబ్బాయి అడుగుపెట్టారు— అన్నపూర్ణా విశ్వేశ్వరుల సన్నిధిలోనే మా వివాహం అతిసామాన్యంగా జరిగిపోయింది."

కథలో లీనమైపోయి వింటూన్న గంగాధరం తేరుకొని ప్రశ్నించాడు.

"అయితే మీకిద్దరకు పరిచయమెలాగైంది?"

భవానీ ఏదో చెప్తూండగా రఘు అడ్డువచ్చాడు. "ఆ సంగతి నేను చెప్తా" నంటూ.

"నేను ప్రతి సాయంకాలం అలా షికారు వెళ్ళేవాడిని, యాత్రార్థం వచ్చే రకరకాల వ్యక్తుల్ని చూస్తూ. సరిగా అదే టైముకు పూలపళ్ళాలతో ఈ భవానీ, తాతగారు ఆలయం లోకి వెళుతూనో వస్తూనో కనిపించేవారు. నాకు మహా ఆశ్చర్యంగా వుండేది— వానైనా వరదైనా తప్పకుండా వారా గుళ్ళోకి ప్రతిదినం వెళ్ళడం—ముఖ్యంగా అంత చదువుకున్న అమ్మాయికికూడ ఈ పిచ్చి నియమాలు, నమ్మకాలు ఏమిటని! ఒకే క్లాసు అవడంవల్ల ఇదివరకే ముఖ పరిచయముంది.

ఒకరోజు దేవాలయ పరిసరాల్లో వుండగా విపరీతమైన వర్షం కురిసింది. ఇహ గత్యంతరం లేక ఆలయంలోకి వెళ్ళాను. అదే ప్రప్రథమంగా ఆ గుళ్ళోకి వెళ్ళడం. ఆ దైవ విగ్రహాలు, గంటల గణగణాలు, భక్తుల సందడి, ఆవరణాలో పూలచెట్లూ —ఆ వాతావరణంలో అడుగెట్టగానే ఎంతో తేలికపడింది హృదయం. ఆలయంలో అంత ప్రశాంతంగా ఉంటుందని నాకదివరకు తెలియదు. అది మొదలు ప్రతిరోజు గుళ్ళోకి వెళ్ళేవాడిని కాని ఒకనాడూ చేతులెత్తి ఆ దైవ విగ్రహాలకు నమ

స్మరించలేదు. తాతగారేవేవో శ్లోకాలు చదువుతూంటే వింటూ కూర్చుని వారితోపాటే నేను వచ్చేవాడిని. ఏదో దివ్యశక్తి నన్నా వ్యక్తులవైపు ఆకర్షించింది. క్రమంగా పరిచయంకూడా అయింది.

ఒకరోజున ఏదో పండుగ—శివరాత్రి అనుకుంటా. గుళ్ళో చాల ఆలస్యమైంది. అక్కడికి నేనుండే లాడ్జి చాలా దూరం. మా యింటికిరమ్మని తీసుకువెళ్ళారు. ఆలయ వాతావరణంకంటె ప్రశాంతంగా వుంది. పెద్ద పూలతోట మధ్యనున్న ఆ చిన్న యింట్లో. ఆ రాత్రి భోంచేసి అక్కడే పడుకున్నాను.

ఆ మర్నాడు సరిగా ఈ సమయానికే మెలకువ వచ్చింది. ఇప్పుడు మీరే పద్యాలైతే విన్నారో అవే వినపడుతున్నాయి— అదే కంఠంతో!

ఆశ్చర్యంతో లేచి ప్రక్కగదిలోకి వెళ్ళేప్పటికి సరిగా ఇప్పుడు భవానీ మీకే స్థితిలో కన్పించిందో అలాగే కన్పించింది శైవ మందిరం దగ్గర. అప్రయత్నంగా చేతులెత్తి ఆ భగవద్విగ్రహాలకు నమస్కరించాను— నా జీవితంలో తొలిసారిగ! విగ్రహారాధనలో నమ్మకం లేని నాకు ఆ క్షణంలో ఎక్కడలేని నమ్మకమూ వచ్చింది. అనేక క్రొత్త విషయాలు తెలిసినట్లయింది. అందుకు మూలకారణం భవానీ! అందువల్ల నా జీవితానికి కావలసిన వ్యక్తి ఆమె అన్పించింది...... స్నేహం వృద్ధిపొందినకొలదీ ఆమెలో అన్నీ మంచిగుణాలే

కాని మచ్చుకైనా చెడుగుణమొక్కటీ కన్పించలేదు. 'వివాహము' అనేది చేసుకుంటే ఆమెనే చేసుకోవాలనుకున్నాను. దైవం అనుకూలించాడు" అంటూ ముగించాడు రఘు.

"వయస్సుకు చిన్నదానివైనా నీకు నమస్కరించాలి తల్లీ. కని, పెంచి, పెద్దచేసిన మేము ఏడి నాస్తికత్వాన్ని పోగొట్టలేకపోయాము. నీవు క్షణంలో మార్చేశావు. ఏదో అప్పుడు మాటపట్టింపులతో వచ్చేసి తిరిగి ఒకరి విషయాలోకరం తెల్సుకోలేదు. మానాన్న కూ తాత అన్నదమ్ములే తల్లీ. ఇన్నాళ్ళకు ఈరీతిగా కలిపాడన్నమాట భగవంతుడు!" అంటూ చేయెత్తి నమస్కరించాడు భగవంతు నుద్దేశించి. గుడిలో జేగంటలు అంతకంత కెక్కువగా విన్పిస్తున్నాయి.

"ఇటువంటి ఉత్తమురాలు మన కులంలోదే గనుక సంతోషిస్తున్నావు. అలా కాకపోయినప్పటికీ అభ్యంతరాలుండకూడదు నాన్నా. ఏమంటావు?" అన్నాడు రఘు గర్వంగా.

ఒక్క నిముషం ఆలోచించి అన్నాడు గంగాధరం. "ఏమనగలం నాయనా మనం? అంతా దైవ నిర్ణయం."

"మీరు స్నానం కానిస్తే త్వరగా గుళ్ళోకి వెళ్ళివద్దాం. ప్రొద్దెక్కుతోంది" అంది భవానీ రఘుతో. అప్పుడే లోపలికి ప్రాకుతూన్న లేఎండను చూస్తూ, వారి పవిత్ర స్నేహానికి నాందీగీతం ఆలపించిన దేవాలయానికి ప్రతిరోజు వెళ్ళే అలవాటుంది వారికి.

"కొంచెంసేపు ఆగమ్మా, అందరం కలిసే వెళ్దాం" అంటూ లేచారు సీతమ్మా, గంగాధరం.

అందరు కలిసి ఆనందంగా గుళ్లోకి వెళ్ళడం చూచి విస్తుపోయారు ఇంట్లో నౌకర్లు— వాళ్ళేదో మహా ప్రళయం జరుగుతుందనుకొని ఎదురుచూస్తున్నారు నిన్నటినుంచి.

ప్రదక్షిణానంతరం దైవ దర్శనానికి వెళ్తున్నారు— ముందు సీతమ్మ, గంగాధరం, ఆ వెనుక రఘు, భవానీ, ఆ వెనుక పద్మ.

"త్వరలో మనుమడి నిమ్మని కోరుకో అమ్మా!" అన్నాడు గంగాధరం. సీతమ్మ ముసిముసి నవ్వులు నవ్వింది.

"భవానీ!" అన్నాడు రఘు మెల్లగా.

"ఏమిటి ఇక్కడకూడ రహస్యాలు?" అంది భవానీ నవ్వుతూ, చిరుకోపంతో.

"ముందు పుట్టిన బిడ్డకు నీ పేరు పెట్టుకుంటామని దణ్ణం పెట్టుకో. ఈశ్వర సాన్నిధ్యంలో పెళ్ళయిందిగా మరి!" అన్నాడు కొంటెగా.

సిగ్గుపడిపోయింది భవాని.

"కొంటె ఆలోచనలు మాని ముందు పరీక్ష పాసవాలని కోరుకోండి" అంది.

"నీదా?"

"మీది!"

"ఇద్దరిదీను" అంది పద్మ వెనుకనుంచి, ఖంగున గంట మ్రోగిస్తూ.

ఇద్దరూ ఉలిక్కిపడి వెనక్కు చూచారు. వెనుక పద్మ వున్న సంగతి మరచిపోయారు అంతవరకూ!

"నేను విన్నానులే వదినా అంతా" అని పకపక నవ్వింది పద్మ.

రఘు, భవానీకూడా ఒకరినొకరు చూచుకొని నవ్వారు. భక్తులు వాయించే జే గంటల గణగణాలలో ఆ ప్రేమికుల నవ్వుల కిలకిలలు లీనమైపోయాయి.